అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించడాన్ని నిరసిస్తూ నినాదాలు చేస్తూ ఆమెతో సహా బయటకు వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

తనకు జరిగిన అవమానంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సునీతా లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

నిండు సభలో ఆడబిడ్డకు అవమానం

- ఆ అక్కల్ని నమ్ముకుంటే జూబ్లీ బస్టాండే
- మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అసందర్భ, అనుచిత వ్యాఖ్యలు
- ఇంకా ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు?: భట్టి
- సీఎం వ్యాఖ్యలకు నొచ్చుకున్న సబిత
- రేవంత్ సీఎం హోదాను అగౌరవపర్చారు
- మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి కంటతడి
- సీఎం వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్
- ఇది అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డే: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో బుధవారం మధ్యాహ్నం ద్రవ్య వినిమయ బిల్లుపై ప్రభుత్వం, కేటీఆర్ మధ్య సంవాదం కొనసాగుతున్నది.. వెంటనే అసందర్భంగా లేచిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కేటీఆర్ వెనకాల ఉండే అక్కలు ఇక్కడ (గతంలో అధికారపక్షంలో) ఉండి చెప్పీ చెప్పీ ఇక్కడ ముంచి అక్కడికి తేలిండ్రు. ఆ అక్కల మాటలు విన్నడనుకో జూబ్లీ బస్టాండులో కూర్చోవాల్సి వస్తది' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో సీఎం చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. సీఎం మాట్లాడిన మాటలు యథాతథంగా.. 'తాము కలిసి వస్తాం, ప్రభుత్వానికి సహకరిస్తామని కేటీఆర్ పదే పదే చెప్తున్నారు. కలిసి వస్తరా? లేదా? అనేది, అన్నం ఉడికిందా? లేదా? అనేది ఒక మెతుకును చూస్తే తెలుస్తుంది. ప్రతిపక్ష నాయకుడు సభలకే రానప్పుడు వీళ్లు కలిసి వస్తరంటే నమ్మేదెవరు? అందుకే నేను వారికి సూచన చేస్తున్నా.. కేటీఆర్ వెనకాల ఉండే అక్కలు..' అంటూ అసందర్భ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంలో కేటీఆర్ వెనుక సీట్లో సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి కూర్చున్నారు. సీఎం వ్యాఖ్యలు సభలో వాయిదాలకు, ఆందోళనలకు, నిరసనలకు కారణమయ్యాయి. మహిళా ఎమ్మెల్యేలపై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని, సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సభలో పెద్ద దుమారం రేగడంతో రేవంత్ మళ్లీ వివరణ ఇచ్చారు. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు వ్యక్తిగత సంభాషణ ఉంటుందని, ప్రజాజీవితంలో చర్చ ఉంటుందని వ్యాఖ్యానించారు. 'సబితక్క నన్ను పార్టీలోకి ఆహ్వానించిన మాట, భవిష్యత్తు ఉంటుందని చెప్పిన మాట వాస్తవం. వారి మాట విశ్వసించి, సొంత అక్కగా భావించి, కుటుంబ సంబంధాల నేపథ్యంలో, ఇతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆనాడు కాంగ్రెస్‌లో చేరా. 2018లో నేను ఎమ్మెల్యేగా ఓడిపోతే, పార్లమెంట్ ఎన్నికలు వచ్చినప్పుడు సబితక్క నన్ను పిలిచి నువ్వు మల్కాజిగిరి ఎన్నికల్లో పోటీ చేయ్. నేను అండగా నిలబడతా అని మాట ఇచ్చారు. పార్టీ నాకు ఎంపీ టికెట్ ఇచ్చిన మరుక్షణం ఆమె పార్టీని వీడి టీఆర్ఎస్‌లో చేరింది. తమ్ముడిగా నన్ను పిలిచి ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రోత్సహించి, కేసీఆర్ మాయమాటలకు, అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి టీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి పొందింది. తమ్ముడిని మోసం చేసింది కాబట్టే ఈ రోజు నమ్మొద్దు అని కేటీఆర్‌కు చెప్పిన. వాళ్ల పేర్లు నేను తీసుకోలేదు. కొత్త గవర్నర్‌ను రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నా. మళ్లీ వచ్చి అన్నింటికీ, అందరికీ సమాధానం చెప్తా' అని చెప్పి సభ నుంచి వెళ్లిపోయారు.

సబితను ఏకవచనంతో సంబోధించిన భట్టి

> ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల గొడవకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరింత ఆజ్యం పోశారు. మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా ఏకవచనంతో సంబోధిస్తూ జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారు. 'మూడుసార్లు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి దశాబ్దకాలంపాటు మంత్రిగా కాంగ్రెస్ కొనసాగించింది. అధికారం కోల్పోయాక పార్టీ తొలిసారిగా దళితవర్గానికి చెందిన నన్ను సీఎల్పీ నాయకుడిని చేసింది. ఇలాంటి సమయంలో నా వెనకుండి నడిపించాల్సిందిపోయి బీఆర్ఎస్‌లో చేరారు. ఇంటికి వెళ్లి మళ్లీ వెళ్లొద్దని బతిమిలాడాను. కానీ నీ అధికారం, నీ స్వార్థం కోసం, నన్ను సీఎల్పీ నాయకుడిగా చేయనీయకుండా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు ఆవేదన చెందుతున్నానని అంటున్నారు. ఇంకా ఏ ముఖం పెట్టుకొని సీఎంను పట్టుకొని మాట్లాడుతున్నారు. ఏం చేశారని, ఏం సాధించారని, పార్టీలు మారి, పరువుతీసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు' అని మహిళ అని చూడకుండా సబితపై చులకనగా మాట్లాడారు.

ఇష్టం లేకపోతే సభ నుంచి వెళ్లిపోండి: శ్రీధర్‌బాబు

ఒక మహిళా ఎమ్మెల్యేపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మంత్రి శ్రీధర్‌బాబు ఆయనకే మద్దతు పలికారు. మహిళా ఎమ్మెల్యేల పేర్లను సీఎం తీసుకోలేదంటూ లాజిక్ ప్లే చేశారు. 'సీఎం మాట్లాడుతున్నప్పుడు ఎవరి పేర్లు తీయలేదు. మీ వెనకాల ఉన్న కొంతమంది అంటే.. సభ బయట ఉన్నవాళ్లు కూడా కావొచ్చు. రాజకీయ పరంగా అందరిని నమ్ముకోవద్దని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి వాళ్ల(సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి) పేర్లే తీయలేదు. వాళ్లను రెచ్చగొట్టి సభను చెడగొడుతున్నారు. సీఎం వాళ్ల పేర్లు తీశారా? వాళ్ల పట్ల మాకు, మా సీఎంకు గౌరవం ఉన్నది. వారిని అనలేదు కదా! సభలో సైలెంట్‌గా ఉండాలని చెప్పండి. వారికి ఇష్టం లేకపోతే వెళ్లిపోమనండి' అని దురుసు వ్యాఖ్యలు చేశారు.

సీఎంకు వత్తాసు పలికిన మహిళామంత్రి సీతక్క

ఎమ్మెల్యే సబితపై వ్యాఖ్యలను ఓ మహిళగా ఖండించాల్సిన మహిళా మంత్రి సీతక్క కూడా సీఎంకే వత్తాసు పలికారు. 'నాడు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన సోదరి ఎమ్మెల్యే సబితమ్మతో నేడు కాంగ్రెస్‌లోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ గవర్నర్‌కు ఫిర్యాదు ఇప్పించారు. వాళ్లు రాజీనామా చేయించి తీసుకున్నారా? ఒకరిద్దరు మహిళాఎమ్మెల్యేలు మీతో వస్తా తమ్ముడూ! అని చెప్పి ఏం చేశారో..! ఆ బాధ మా సీఎం అనుభవించారు. ఢిల్లీకి వస్తున్నా అని చెప్పి, రాహుల్‌గాంధీ టైం తీసుకున్నాక ఏం చేశారో..! ఆ బాధ అనుభవించారు కాబట్టే కేటీఆర్‌కు సూచన చేశారు. మేం ఎప్పటికీ ఒకేదానికి కట్టుబడి ఉన్నాం' అని వ్యాఖ్యానించారు.

భగ్గుమన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు... పోడియం వద్ద బైఠాయింపు

సీఎం వ్యాఖ్యలతో సభలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భగ్గుమన్నారు. ఆమెకు అండగా నిలిచారు. సీఎం రేవంత్‌రెడ్డి తీరును తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేలు కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వివేకానంద, గంగుల కమలాకర్, పల్లారాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, విజయుడు పోడియం వద్దకు దూసుకెళ్లారు. సభలో ఆందోళనకు దిగారు. స్పీకర్ ఎదుట నిల్చొని నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అరగంట పాటు తమ ఆందోళనను కొనసాగించారు. 'మహిళలపై సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపూరిత వైఖరి నశించాలి' అంటూ నినాదాలు చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని, సీఎం క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సబితా ఇంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలకు దిగారు. ఒక దశలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైకి దూసుకెళ్లడం గమనార్హం. ప్రభుత్వ తీరు మారకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం వద్ద తమ నిరసనను తీవ్రం చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి స్పీకర్ పోడియం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చప్పట్లు కొడుతూ 'సీఎం వైఖరి నశించాలి.. నహీ చలేగా.. నహీ చలేగా.. తానీషాహీ నహీ చలేగా' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

మాట్లాడే అవకాశమివ్వాలని దండం పెట్టిన కేటీఆర్

సీఎం వ్యాఖ్యలపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. స్పీకర్‌ను పదే పదే రిక్వెస్ట్ చేశారు. ఒక దశలో మాజీమంత్రి కేటీఆర్ మూడుసార్లు దండం పెట్టి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు. సబితాఇంద్రారెడ్డికి స్పీకర్ కొద్దిసేపు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. నిరసనలతో సభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అయినా వారికి అవకాశం దక్కలేదు.

మైక్ ఇవ్వాల్సిందే: అక్బరుద్దీన్ ఒవైసీ

సబితాఇంద్రారెడ్డికి మైక్ ఇవ్వాల్సిందేనని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సైతం డిమాండ్ చేశారు. చర్చ కొనసాగుతున్న క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో అక్బరుద్దీన్ ఒవైసీ జోక్యం చేసుకుని మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. సభ్యురాలు సబిత పేరును ఉటంకిస్తూ వ్యాఖ్యలు చేశారని వివరించారు. సభ్యుల హక్కుల ప్రకారం వివరణ ఇచ్చుకునేందుకు ఆమెకు మైక్ ఇవ్వాల్సిందేనని స్పీకర్‌కు తెలిపారు. మాట్లాడేందుకు అవకాశమిచ్చి సభను ఆర్డర్‌లో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ మైక్ ఇవ్వకపోవటంతో మరోసారి కూడా లేచి ఇదే విషయాన్ని వెల్లడించారు. సబితకు మద్దతుగా నిలిచారు.

సభ మధ్యలోనే వెళ్లిపోయిన సీఎం

సీఎం, డిప్యూటీ సీఎం వ్యాఖ్యలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. దీంతో ఎమ్మెల్యేలంతా ఒక్కసారిగా వెల్‌లోకి దూసుకొచ్చారు. స్పీకర్ ఎంత వారించినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టు వదల్లేదు. కూర్చోవాలని ఎన్నిమార్లు చెప్పినా వెనక్కి తగ్గలేదు. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో సభ మొత్తం గందరగోళంతో గాడి తప్పింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కొత్త గవర్నర్ వస్తున్నారని, ఆయనను రిసీవ్ చేసుకొని వచ్చిన తర్వాత అందరికీ సమాధానం చెప్తానంటూ హఠాత్తుగా వెళ్లిపోయారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు .. సీఎం పారిపోయారంటూ నినాదాలు చేశారు. సీఎం షేమ్ అంటూ నినదించారు. అనంతరం స్పీకర్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లకుండా అక్కడే ఉండిపోయారు.

మార్షల్స్ మోహరింపు

వాయిదా అనంతరం సుమారు రెండున్నర గంటల తర్వాత కూడా తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా స్పీకర్ ఇవ్వలేదు. దీంతో ఎమ్మెల్యేలు తమ నిరసనను మరింత ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో వాళ్లను సభ నుంచి ఎత్తివేసేందుకు ప్రభుత్వం మార్షల్స్‌ను మోహరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ చుట్టుముట్టారు. చివరికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండానే ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపి.. సభను వాయిదా వేశారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి మీడియా పాయింట్ వరకు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.

లోకం పోకడ



రేవంత్ అన్‌ఫిట్ సీఎం

- అకారణంగా, అసభ్యంగా, హీనంగా మహిళలను సభలో అవమానించారు
- మహిళా నేతలను ఏ ముఖం పెట్టుకొని వచ్చారంటారా? భట్టీ.. ఎంత ధైర్యం?
- తక్షణమే క్షమాపణ చెప్పాలి: కేటీఆర్
- ఆడబిడ్డలపై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా నేడు దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): 'అకారణంగా, అసభ్యంగా, హీనాతిహీనమైనరీతిలో మహిళలను అవమానించిన రేవంత్‌రెడ్డి.. అన్‌ఫిట్ ముఖ్యమంత్రి! ఆ పదవికి తగడు' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఈ అక్కలను నమ్ముకుంటే పార్టీని ముంచారు.. నన్ను ముంచారు.. రేపు నిన్ను కూడా నట్టేట ముంచుతరు.. ఇగ జూబ్లీ బస్టాండ్‌లో కూసున్నట్టే' అంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడడం హేయం, దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇది ఒక ముఖ్యమంత్రి స్థాయికి తగని మాట, ఇది ఒక్క సబితక్కకో, సునితక్కకో, లక్ష్మక్కకో జరిగిన అవమానం కాదు.. యావత్ తెలంగాణ ఆడబిడ్డలకు జరిగిన అవమానం! తక్షణమే రాష్ట్ర మహిళలకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కేటీఆర్ బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'ఎందుకు నోరు పారేసుకున్నడో తెలియదు.. కండకావరంతో మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఆడబిడ్డల ఉసురు తాకుతది' అంటూ ఫైర్ అయ్యారు. సబితక్క, సునితక్క, లక్ష్మక్క స్వశక్తితో ఎదిగారని, రేవంత్‌లాగా జిమ్మిక్కులతో పదవిలోకి రాలేదని, వీళ్లంతా ప్రజల్లో తిరిగి మూడు నాలుగుసార్లు గెలిచి వచ్చారని, సబితక్క 5సార్లు గెలిచిన విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడాలని సూచించారు. మహిళలను పట్టుకొని నోటికొచ్చినట్టు వాగడం సరికాదని హితవుపలికారు. 'ఆ డబిడ్డలను పట్టుకొని ఏ ముఖం పెట్టుకొని వచ్చారంటారా? డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏ ధైర్యంతో అలా మాట్లాడుతున్నరు.. మరి మీరేముఖం పెట్టుకొని వచ్చారు?' అంటూ నిలదీశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తక్షణమే సీఎం, డిప్యూటీ సీఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నేడు దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు

సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై సీఎం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 'తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉన్నదన్న కనీస సోయిలేకుండా అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది' అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ప్రజల మన్ననలు అందుకుంటూ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతో, అనేక త్యాగాలతో ప్రజాసేవ చేస్తున్న ఇద్దరు సీనియర్ మహిళా సభ్యులపై అహంకారంతో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలందరి మనసులను నొప్పించాయని, జీవితంలో ఎదగాలనుకుంటున్న ప్రతి ఆడబిడ్డకు ఆ వ్యాఖ్యలు అవమానకరమని కేటీఆర్ ధ్వజమెత్తారు.

నేను అసభ్యంగా మాట్లాడలేదు

మోసానికి పర్యాయపదం సబిత అని భట్టి అన్నారు

అసెంబ్లీ ప్రజాస్వామికంగా జరుగుతున్నది

చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీలో బుధవారం తాను అసెంబ్లీలో ఒక్కమాట కూడా అసభ్యంగా మాట్లాడలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన.. మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డిని మోసానికి పర్యాయపదం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబోధించారని తెలిపారు. సునీతాలక్ష్మారెడ్డి కోసం 2018 ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తే తన మీద రెండు కేసులు పెట్టారని, కౌడిపల్లి, నర్సాపూర్‌లో ఇప్పటికీ కేసులున్నాయని వెల్లడించారు. ఆమె అధికార పార్టీలోకి వెళ్లి మహిళా కమిషన్ పోస్టు తీసుకొని, ఎమ్మెల్యే అయ్యారని, అయినా ఆ కేసులు తీసేయించలేదని చెప్పారు. సబితాఇంద్రారెడ్డి తనను కాంగ్రెస్‌లోకి రమ్మన్నారని, తన ఎన్నికల బాధ్యత తీసుకుంటారని చెప్పారని అన్నారు. తర్వాత తనకు అండగా ఉండాల్సింది పోయి, తాను నామినేషన్ వేసినప్పుడు వ్యతిరేక ప్రచారం మొదలుపెట్టారని తెలిపారు. అందుకే అక్కల మాటలు నమ్మి తాను మోసపోయానని చెప్పానని వివరణ ఇచ్చారు.

యావత్తు తెలంగాణ ఆడబిడ్డలకు అవమానం

మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను ప్రజలు లెక్కిస్తున్నరు: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సాక్షిగా మహిళా లోకాన్ని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ సమావేశాలు ఎంతో హుందాగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి గర్హనీయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం తప్పా? రైతన్నల ఆత్మహత్యలు, నేతన్నల మరణాలు, ఆటో కార్మికుల బలవన్మరణాలపై ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా? విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పట్ల అసెంబ్లీ సాక్షిగా గొంతెత్తడమే తప్పా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మందబలంతో కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న దురహంకారాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని, కాంగ్రెస్ చేస్తున్న ఒక్కో తప్పును లెక్కబెడుతున్నారనే విషయాన్ని రేవంత్ సర్కార్ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

- సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- మమ్మల్ని నమ్మితే బతుకు బస్టాండా?
- భట్టి అలాంటి వ్యాఖ్యలెలా చేస్తారు?
- మీడియా ఎదుట సబిత కంటతడి

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గుండెల నిండా బాధతో ఆమె కండ్లు చెమర్చగా గొంతు తడబడింది. నిర్భయంగా మాట్లాడే ఆమె.. గద్గదస్వరంతో మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వయంగా ఆమే వెల్‌లోకి దూసుకొచ్చారు. ఒక దశలో సభలో కింద కూర్చొని నిరసన తెలిపారంటే ఆమె ఎంత నొచ్చుకున్నారో అర్థమవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. 'వెనుక కూర్చున్న అక్కల్ని నమ్ముకోవద్దని కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచన చేశారు. అంటే మేం ఏం మోసం చేశాం? ఏం ముంచినం? ఈయన్ను ముంచినమా? ఆనాడు కాంగ్రెస్‌లోకి వస్తే ఆశాకిరణం అయితవని చెప్పి, బతిమిలాడి పార్టీలోకి ఆహ్వానించానో లేదో సీఎం రేవంత్‌రెడ్డి గుండెల మీద చెయ్యి వేసుకొని చెప్పాలి. నన్ను ఎందుకు టార్గెట్ చేస్తున్నావ్? ఏం మోసం చేశాం? ఇప్పుడే కాదు.. ఎన్నికల సమయంలోనూ ఇదేవిధంగా వ్యవహరించారు. నా నియోజకవర్గంలో ప్రచారానికి వచ్చి సబితక్క పొద్దున ఒక మాట, రాత్రి ఒక మాట మాట్లాడుతదని అన్నారు. ఏం మాట్లాడినం? ఎవర్ని అవమానిస్తున్నావో ఒక్కసారి ఆలోచించుకోండి. ఎందుకు అవమానిస్తున్నావ్? ఎందుకు కక్ష? ప్రతిసారి ఎందుకు టార్గెట్ చేస్తున్నావ్? మాపై చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలి. ఈ రోజు సీఎం ఎక్కడి నుంచి వచ్చారు? ఏ పార్టీలో నుంచి ఏ పార్టీలో చేరారు? రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కేసీఆర్ ఇంటిపై వాలిన కాకి నా ఇంటిపై వాలితే కాల్చి పడేస్తానన్నారు. అలాంటిది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఎంతమంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నారో చెప్పాలి. వారిని ఎలా చేర్చుకున్నారో చెప్పాలి. నాపై అందరూ మాట్లాడుతుంటే సీఎం ఎంజాయ్ చేస్తున్నారు. ఆ రోజు ఆయన కాంగ్రెస్‌లోకి వస్తున్నప్పుడు ఒక అక్కగా నేను ఆయనను ఆశీర్వదించిన. బాబు నువ్వు పెద్దగా ఎదుగుతావు.. ఈ రాష్ట్రానికి సీఎం అవుతావు అని ఆహ్వానించిన. అలాంటి నాపై రేవంత్‌రెడ్డి ఎందుకు కక్షగట్టారో అర్థం కావడంలేదు. ఒక ఆడబిడ్డకు బాధ అయితుంటే వినే స్థితిలో లేరా?' అని ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. నిండు సభలో ఒక మహిళ కన్నీరు కార్చడంతో సభ మొత్తం గంభీరమైన వాతావరణం నెలకొన్నది.

తలవంచుకోవాల్సిన సందర్భమిది

'కాంగ్రెస్‌లోకి రేవంత్ రాకముందే ఆ పార్టీకి మేం సేవలు అందించాం. భుజాన జెండా వేసుకొని కాంగ్రెస్ కోసం కష్టపడ్డాం. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని నేను కూడా కోరుకున్నా. నేను, సునీత పార్టీని మోసం చేశామని రేవంత్ మాట్లాడారు. రేవంత్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని కోరటమే నేను చేసిన తప్పు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మమ్మల్ని ఏ ముఖం పెట్టుకొని వచ్చారని ఎలా అంటారు? ఇది రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు తగులుతుంది' అంటూ భావోద్వేగానికి గురైన సబిత కంటతడి పెట్టుకున్నారు. అసెంబ్లీ వాయిదా అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు రాగా, కాంగ్రెస్ నేతలు అక్కడే ఎక్కువసేపు ఉండటంతో పక్కనే మీడియాతో మాట్లాడారు. ఆడబిడ్డలు క్షేమం కోరుకుంటారని, నమ్మినవారికి ప్రాణం ఇస్తారని తెలిపారు. అసెంబ్లీలో జరిగిన అవమానం సునీత, సబితకు మాత్రమే కాదని, యావత్తు తెలంగాణ ఆడబిడ్డలకు అని చెప్పారు. అసెంబ్లీలో ఆడబిడ్డలను అవమానపరిచే పరిస్థితి వచ్చిందంటే నిజంగా తలవంచుకోవాలని ఆవేదన వ్యక్తంచేశారు. సభలో జరిగిన దానిపై ప్రతిఇంట్లోని ఆడపిల్లలు ఆలోచిస్తున్నారని అన్నారు. 24 ఏండ్ల నుంచి తాను అసెంబ్లీకి వస్తున్నానని, సీఎం పీఠంపై చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్‌ను చూశానని సబితారెడ్డి తెలిపారు. ఈ రోజు సీఎం పీఠంపై రేవంత్‌రెడ్డిని కూడా చూస్తున్నానని, నిండు సభలో మహిళలపై అనుచితంగా మాట్లాడి సీఎం పీఠాన్నే రేవంత్ అగౌరపరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభలో కేటీఆర్ ప్రతి అంశాన్ని కూలంకషంగా వివరించే ప్రయత్నం చేశారని, ఆ ప్రసంగం నుంచి ద